క్లుప్తంగా

అధ్యాపకుడికి సన్మానం



కోవూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగంలో లెక్చరర్‌గా పని చేస్తున్న సురేంద్రబాబుకు డాక్టరేట్‌ను ఎస్వీ వర్సిటీ ప్రదానం చేసింది. ఫైనాన్షియల్ ఫర్ఫార్మెన్స్ ఆఫ్ ఎన్టీపీఎస్ లిమిటెడ్ అనే అంశంపై ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గానూ ఇది లభించింది. ఈ సందర్భంగా సురేంద్రబాబును ప్రిన్సిపల్ లక్ష్మీప్రసూన, రామ్‌ప్రసాద్ తదితరులు సత్కరించి అభినందనలను తెలియజేశారు.

బోధనేతర పనుల బహిష్కరణ



ఎంఈఓకు వినతిపత్రమిస్తున్న నేతలు

కొడవలూరు: మండలంలోని ఉపాధ్యాయులు బోధనేతర పనులను శుక్రవారం నుంచి బహిష్కరిస్తున్నారని ఫ్యాప్టో, యూటీఎఫ్ నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు ఎంఈఓ వసంతకుమారికి వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. బోధనేతర పనులతో బోధనకు సమయం సరిపోవడంలేదన్నారు. ఫ్యాప్టో నేతలు బైనా లక్ష్మీకాంతం, సత్యనారాయణ, యూటీఎఫ్ నేతలు తిరుపాల్, ఖాజావలీ, శైలజ, జమీర్ అహ్మద్, కీర్తన, గౌస్‌బాషా, శ్రీనివాసులు, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాస్ పనులు త్వరలో ప్రారంభం



రైల్వే గేట్ వద్ద పరిశీలిస్తున్న అధికారులు

కొడవలూరు: మండలంలోని రామన్నపాళెం రైల్వే అండర్ పాస్ పనులను త్వరలో ప్రారంభించనున్నామని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిల ఏజీఎం జీహెచ్ఎన్ చౌదరి పేర్కొన్నారు. అండర్ పాస్ నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించే విషయమై విద్యుత్ శాఖ ఏఈ రాములతో కలిసి రామన్నపాళెం రైల్వే గేట్ ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సాధ్యమైనంత త్వరలోనే పనులను ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. గేట్లున్న అన్ని చోట్ల అండర్ పాస్‌లను నిర్మించేందుకు రైల్వే శాఖ సంకల్పించిందని వివరించారు. శివనారాయణరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరీదేవి భక్తుల కొంగు బంగారమని ముదిరాజ్ మహాసభ గౌరవాధ్యక్షుడు కొర్నా నారాయణరావు పేర్కొన్నారు. 2026 నూతన సంవత్సర క్యాలెండర్లను ఆలయ ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. ఆరణి జయరామ్, బీజేపీ నేత మొగరాల సురేష్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్, రాష్ట్ర కార్యదర్శి పాపారావు, పీఎల్ రావు, గంపల సుబ్రహ్మణ్యం, కనకట్ల మోహన్, మైపాడు సర్పంచ్ సంగం వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ – 17 బాలబాలికల ఫుట్‌బాల్ జట్లను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శుక్రవారం ఎంపిక చేశారు. అండర్ – 17 విభాగంలో ఎంపికలకు క్రీడాకారులు హాజరయ్యారు. ఎస్జీఎఫ్ కార్యదర్శులు రమణయ్య, దేవిక తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. భక్తులు వేచి ఉన్న క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 66,883 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 26,000 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.15 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని, ముందుగా వెళ్లిన భక్తులను అనుమతించరని టీటీడీ స్పష్టం చేసింది.

ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ

- మెడికల్ కాలేజీలను ప్రైవేట్ సంస్థలకు అమ్మడం దుర్మార్గం
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ప్రదర్శిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నాయకులు

వెంకటాచలం: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఉద్యమంలా పూర్తి చేస్తామని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సర్వేపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం కోటి సంతకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద విద్యార్థులందరికీ వైద్య విద్య అందించాలనే ఆలోచనతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలు నిర్మించాలని గొప్ప ఆలోచన చేయడం జరిగిందన్నారు. వాటిని నిర్మిస్తే జగన్‌కు పేరు వస్తుందనే కుట్రలతో ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. సుమారు రూ.20,000 కోట్ల విలువ చేసే 850 ఎకరాలను ఎకరా రూ.100కు ధారాదత్తం చేస్తుండటం దారుణమన్నారు. పేదల సొమ్మును ప్రైవేట్ వ్యక్తులకు అమ్మచూపడం మంచిపద్ధతి కాదని తెలియజేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందన్నారు. పేదల కోసం ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఏర్పాటు కాకపోవడంతో వైద్యసేవలు దూరమవుతాయని తెలియజేశారు.

పేదలకు అన్యాయం

చంద్రబాబు నిర్ణయం వల్ల పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కాకాణి మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు కోటి సంతకాల సేకరణను నెల్లూరు జిల్లాలో ఉద్యమంలో పూర్తి చేస్తామన్నారు. నవంబర్ 22 తేదీ వరకు 42 రోజులపాటు గ్రామాలు, పట్టణాల్లో సంతకాలు సేకరిస్తామన్నారు. ఈనెల 28వ తేదీ నుంచి నియోజకవర్గ స్థాయిలో, నవంబర్ 12వ తేదీన జిల్లా స్థాయిలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. నవంబర్ 26వ తేదీ సేకరించిన సంతకాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గవర్నర్‌కు అందజేస్తామని తెలియజేశారు. రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత మాట్లాడుతూ కాసులకు కక్కుర్తిపడి చంద్రబాబు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. ప్రైవేటీకరణ జరిగితే పేద విద్యార్థులకు, ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, జిల్లా నాయకులు ఆరుగుంట ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాసభల విజయవంతానికి పిలుపు

తోటపల్లిగూడూరు: ఈనెల 11, 12వ తేదీల్లో మండలంలోని నరుకూరు సెంటర్‌లో జరిగే సీఐటీయూ 12వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆటో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మారుబోయిన రాజా పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రజా నాట్యమండలి కళాకారులు ప్రచార జాతా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన కళాకారులు సభలను ఉద్దేశించి పాటలు పాడారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ రెండురోజులపాటు సభలను నరుకూరులో ఘనంగా నిర్వహించనున్నామన్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఆటోలతో నరుకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా బయలుదేరి ఎస్ఎల్వీ లేఅవుట్‌కు చేరుకుంటామన్నారు. సాయంత్రం 6 గంటలకు బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఆదివారం నరుకూరు సెంటర్‌లోని శుభం ఫంక్షన్ హాల్లో ప్రత్యేక కార్యక్రమాలతోపాటు ప్రతినిధుల మహాసభ జరుగుతుందన్నారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీవీవీ ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, సీపీఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గండవరపు శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీస్సులు



కోవూరు: కొడవలూరు మండలం మానేగుంటపాడుకు చెందిన గుణపాటి శ్రీనివాసులురెడ్డి, కృష్ణవేణి దంపతుల కుమార్తె దేవిశ్రీ, ప్రసన్నరెడ్డి వివాహ రిసెప్షన్ కార్యక్రమాన్ని గూడూరులోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వధూవరులకు ఆశీస్సులను మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నేత కలువ బాలశంకర్‌రెడ్డి, మానేగుంటపాడు గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ ఇందూరు రాజవర్ధన్‌రెడ్డి, పుచ్చలపల్లి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

ఓజిలికి సుదీర్ఘ కాలం సర్పంచ్‌గా సేవలందించిన వల్లూరు సూర్యప్రకాశరావు 86వ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రసన్నకుమార్‌రెడ్డి శుభాకాంక్షలను తెలియజేశారు. నగరంలోని ఆయన కుమారుడి నివాసానికి వెళ్లి సూర్యప్రకాశరావును ఆప్యాయంగా పలకరించి బొకేను అందజేశారు. ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను ఆరాతీశారు. దివంగత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డితో తనకున్న అనుబంధాన్ని సూర్యప్రకాశరావు గుర్తుచేసుకున్నారు. కలువ బాలశంకర్‌రెడ్డి, దండిగుంట సీతారామయ్య, వల్లూరు రమేష్, రాయసం దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మానసికారోగ్యంపై అవగాహన అవసరం



కొడవలూరు: ప్లకార్డులతో ప్రదర్శన



ఇందుకూరుపేట: జగదేవిపేటలో..



టీపీగూడూరు : మాట్లాడుతున్న అధికారులు

కొడవలూరు: మానసికారోగ్యంపై అవగాహన అవసరమని కొడవలూరు పీహెచ్‌సీ సీహెచ్‌ఓ సోమశేఖర్ పేర్కొన్నారు. ప్రపంచ మానసికారోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్లకార్డులతో అవగాహన ర్యాలీని గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మానసిక ఒత్తిడితో అనేక రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. యోగా, ధ్యానం, వ్యాయామం చేయడం ద్వారా మానసికంగా ఆరోగ్యంగా ఉండొచ్చని సూచించారు. హెచ్ఎస్ రామ్మోహన్, హెచ్ఎస్‌లు షఫీఉద్దీన్, సుధాకర్, ఎమ్మెల్‌హెచ్‌పీలు సరోజ, స్నేహ, ఏఎన్ఎంలు నదియా, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

⇨ **ఇందుకూరుపేట:** మానసికారోగ్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని జగదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి కిశోర్‌కుమార్ పేర్కొన్నారు. పీహెచ్‌సీ ఆవరణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మానసిక వైద్యంపై అనంతపురం జిల్లా మెంటల్ హెల్త్ టీమ్ డాక్టర్ క్రిస్టినా వివరించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, క్లినికల్ సైకాలజిస్ట్ రేవతి, హెచ్ఈఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

⇨ **కోవూరు:** మండలంలోని పాటూరులో గల ప్రభుత్వ హైస్కూల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కెరీర్, మెంటల్ హెల్త్ కౌన్సెలర్ మధు, ఎంఈఓ రహీమ్,, ప్రధానోపాధ్యాయుడు జుల్ఫికర్ అలీ, ఉపాధ్యాయుడు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

⇨ **తోటపల్లిగూడూరు:** పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాలని జిల్లా ఆరోగ్య సర్వే లైన్స్ అధికారి డాక్టర్ భాస్కర్ సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తోటపల్లిగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ పిల్లలకు శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం ముఖ్యమన్నారు. మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలన్నారు. మానసిక పరిపక్వత లేకనే విద్యార్థులు చిన్న వయసులోనే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వేణుగోపాలరెడ్డి, హెల్త్ కౌన్సిలర్ జ్యోతిర్మయి, ఎడ్యుకేషన్ టీచర్ రామచంద్రయ్య, పాఠశాల ఇన్‌చార్జి సుబ్బారెడ్డి, ఎల్ఈపీ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఇందుకూరుపేట: మండలంలోని నరసాపురం, కొరుటూరు, గంగపట్నం, కొమరిక సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉండదని ఏఈ నరసింహులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు.

- **కొడవలూరు:** మండలంలోని కొత్తవంగల్లు, గండవరం, యల్లాయపాళెం, పద్మనాభసత్రం, రామన్నపాళెం సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 వరకు ఉండదని ఏఈ రాములు తెలిపారు.

సీఐటీయూ సభలను విజయవంతం చేయండి

కొడవలూరు: నరుకూరులో శని, ఆదివారాల్లో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి తలారి నరసింహం శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని సీఐటీయూ కార్మికులు తప్పక హాజరుకావాలని కోరారు.

చిన్నారులకు పరామర్శ

ఇందుకూరుపేట: సంగం మండలం పెరమన వద్ద ఇసుక లారీ ఢీకొనడంతో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు చందుప్రియ, విశ్వంత్‌ను కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి శుక్రవారం పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం వారికి ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో ఆర్థిక సాయాన్ని అందజేశారు.



ముగిసిన మండల స్థాయి స్కూల్ గేమ్స్



కబడ్డీ విజేత జట్టుతో నిర్వాహకులు

పొదలకూరు: స్థానిక డీఎన్నార్ జెడ్పీ బాలుర హైస్కూల్లో రెండు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు శుక్రవారం ముగిశాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, అథ్లెటిక్స్, యోగా, బ్యాడ్మింటన్ పోటీలను అండర్ 14, 17 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించారు. ఇక్కడ విజయం సాధించిన 263 మంది నెలాఖరులో నెల్లూరులో జరిగే డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కబడ్డీ అండర్ 17 బాలుర విభాగంలో అమ్మవారిపాళెం జట్టు విజయం సాధించగా, అండర్ 14 బాలుర, బాలికల విభాగంలో పొదలకూరు బాలుర స్కూల్ జట్టు, అమ్మవారిపాళెం జట్టు విజేతలుగా నిలిచాయి. ఖోఖో బాలుర విభాగంలో పొదలకూరు బాలుర స్కూల్, ఇనుకుర్తి స్కూల్ విజయం సాధించాయి. వాలీబాల్‌లో విరువూరు, తాటిపర్తి స్కూల్స్ గెలిచాయి. చెస్‌లో అమ్మవారిపాళెం, మరుపూరు స్కూల్స్ విద్యార్థులు విజయం సాధించగా, యోగా, బ్యాడ్మింటన్లో నాగార్జున స్కూల్, పొదలకూరు బాలికల హైస్కూల్, అమ్మవారిపాళెం జెడ్పీ హైస్కూల్, శ్రీచైతన్య, మొగళ్లూరు హైస్కూల్ క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. ఈ పోటీలను మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు మోహన్, సునీత, రమేష్, శ్రీనివాసులు, సురేంద్రకుమార్, బాబు, శివ, సురేష్, మహేంద్ర నిర్వహించారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ జలజాక్షి

మనుబోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. దీనికి ఆరోగ్య, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు గైర్హాజరవడంతో ఎంపీపీ వజ్రమ్మ అసహనం వ్యక్తం చేశారు. గైర్హాజరైన వారికి నోటీసులు జారీ చేయాలని ఎంపీడీఓ జలజాక్షిని ఆదేశించారు. సమావేశానికి విచ్చేసిన ఆర్టీసీ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుని ప్రజాప్రతినిధులు నిలదీశారు. అవసరమైన చోట కాకుండా పోలీస్‌స్టేషన్ ఎదురుగా బస్సులు ఆపడం ఏమిటని ప్రశ్నించారు. అలాగే ఉచిత బస్సు అని చెప్పి మహిళలను కండక్టర్లు హేళన చేస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పొన్నూరు రామకృష్ణయ్య, మండల ఉపాధ్యక్షురాలు గుండాల చందన, ఏఈలు కసనా నాయక్, మనోహర్, శరత్, విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి గరుడయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ

మనుబోలు: పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆదినారాయణమ్మ, పద్మజ అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మనుబోలు బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించారు. పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణవేణి, పీఈటీ ప్రతిమ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం



ముత్తుకూరు(పొదలకూరు): పట్టణంలోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్లో ఎన్‌సీసీ యూనిట్‌ను ఎల్‌టీ సీడీఆర్ గణేష్ గందంగవే, హెచ్ఎం చల్లా శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. ఈ యూనిట్‌ను పాఠశాల పీడీ బూదూరు రాంబాబు పర్యవేక్షిస్తారని తెలిపారు. 8, 9 తరగతులు చదివే విద్యార్థులు ఎన్‌సీసీకి అర్హులుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి



సమావేశానికి హాజరైన సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బారావు

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్

కొడవలూరు: ఎడగారులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ఏర్పాటు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వచ్చే సీజన్లోనైనా ముందే పెట్టాలని సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ జ్యోతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇక నుంచి పొరపాట్లు చోటుచేసుకుండా ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేలా చూస్తామని గుండాలమ్మపాళెం సొసైటీ అధ్యక్షుడు బద్వేలు వినీల్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలో వివిధ సమస్యలపై సభ్యులు ఏకరువు పెట్టారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించాక ఆర్టీసీ బస్సులు రద్దీగా ఉండటంతో వివిధ గ్రామాల నుంచి కొడవలూరు హైస్కూల్‌కు వచ్చే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సమస్యను ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎంఈఓ వసంతకుమారి హామీ ఇచ్చారు. అనంతరం జ్యోతి మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కోరారు. ఉపాధి ఏపీఓ అచ్చయ్య, విద్యుత్ శాఖ ఏఈ రాములు, ఎంపీడీఓ సుబ్బారావు, తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డి, వైస్ ఎంపీపీ మారంరెడ్డి సుజాతమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నిర్మల, నాగభూషణమ్మ, సర్పంచ్‌లు నల్లావుల శ్రీనివాసులు, నవీన్, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

మా ఇంటికో నంబర్ ఇవ్వండయ్యా..

- మేజర్ పంచాయతీలో నంబర్లు లేని ఇళ్లు
- పట్టణం పెరుగుతున్నా పాత పద్ధతులే..
- మున్సిపాలిటీకి చేరువలో పొదలకూరు
- ఇబ్బందులు పడుతున్న జనం

పొదలకూరు పట్టణం పెరుగుతున్నా.. ఇంటి చిరునామా తెలుసుకునేందుకు కొత్తవారు అవస్థలు పడుతున్నారు. ఊరు మారుతున్నా తీరు మారడం లేదనేందుకు పొదలకూరు పంచాయతీ నిదర్శనం. ఇక్కడ ఇంటి చిరునామాలను గుర్తించాలంటే పాత పద్ధతిలో కొండ గుర్తుల ప్రకారం వెళ్లాల్సి వస్తున్నట్టు జనం వాపోతున్నారు.



ఇంటి నంబర్లు లేని ఓ ప్రాంతం

పొదలకూరు: పొదలకూరు మేజర్ పంచాయతీకి సర్వేపల్లి నియోజకవర్గంలోనే పెద్దదిగా గుర్తింపు ఉంది. 18 వార్డులు (లింగంపల్లి, చిట్టేపల్లి గ్రామాలు కలిపి) ఉన్నాయి. జనాభా 16,382 మంది ఉన్నారు. ఇందులో 6,161 మంది పురుష ఓటర్లు, 6,462 మంది మహిళా ఓటర్లు, మొత్తం 12,623 మంది ఓటర్లున్నారు. కానీ ఇక్కడ ఇళ్లకు నంబర్లను కేటాయించలేదు. ఓటర్ల జాబితాలో ఉన్న వాటినే పంచాయతీ నిర్వాహకులు పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఫలితంగా కొత్తవారు చిరునామాలు తెలుసుకోవాలన్నా, పార్సిల్ సర్వీసులు, పోస్టల్ శాఖ నుంచి వస్తువులు, ఉత్తరాలు రావాలంటే ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీలో చిరునామాలను తెలుసుకోవాలంటే వీధులకు పెట్టిన మనుషుల పేర్లు, పాత పద్ధతిలో దేవస్థానాల పేర్లను చెపితేనే సంబంధిత కొత్త వ్యక్తులు ఇళ్లకు చేరుకునే పరిస్థితి ఉంది.

నంబర్ తప్పనిసరి

సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేపథ్యంలో ఎక్కడికి వెళ్లినా ఏ వస్తువు కొనుగోలు చేసినా చిరునామాలో ఇంటి నంబర్ తప్పసరి అయ్యింది. అంతేకాక బ్యాంక్ రుణం పొందాలన్నా, అసలు కొత్తగా ఖాతా తెరవాలన్నా, సెల్‌ఫోన్ సిమ్ తీసుకోవాలన్నా డోర్ నంబర్ అడుగుతున్నారు. ఈ నేపథ్యంలో పొదలకూరు వాసులు తంటాలు పడుతున్నారు. ఇలాంటి ఇబ్బందులను తొలగించుకోవాలంటే పంచాయతీ చొరవ తీసుకుని ప్రాంతాల వారీగా ఇంటి నంబర్లను కేటాయించాల్సిన అవసరం ఉందని జనం చెబుతున్నారు. పంచాయతీలో ప్రతి ఇంటికి అసెస్‌మెంట్ నంబర్లున్నా అవి చిరునామాకు పనికి రావంటున్నారు. అలాగే ఓటర్ల జాబితాలోని నంబర్లను చిరునామాలకు పరిగణనలోకి తీసుకోవడం లేదంటున్నారు. అయితే పంచాయతీ పాలకులు వీధులను తెలుసుకునేందుకు ప్రతి వీధికి బోర్డులను ఏర్పాటు చేయించారు.



వీధికి ఏర్పాటు చేసిన బోర్డు

ఇంటి నంబర్లను కేటాయించాలి

పొదలకూరు మేజర్ పంచాయతీలో ఇంటి నంబర్లను కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అది జరిగితే చిరునామాలను తెలుసుకోవడం సులభంగా ఉంటుంది.

– బి.కాళిదాస్, స్థానికుడు

త్వరలో చేపడతాం



మరో నెలరోజుల్లో పంచాయతీలో ప్రతి ఇంటికి నంబర్లను కేటాయించడం జరుగుతుంది. ప్రస్తుతం ఇంటి పన్నులను ఆన్‌లైన్ చేయించే పనిలో ఉన్నాం. మేజర్ పంచాయతీలో ప్రతి ఇంటికి నంబర్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఉన్నాయి. వీలైనంత త్వరలో ప్రక్రియ చేపడతాం.

– యశ్వంత్‌సింగ్, పంచాయతీ సెక్రటరీ, పొదలకూరు